నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 27 ఆగస్టు 2024 | VIKARABAD



అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.2లక్షల పంట రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత సవాలక్ష నిబంధనలు పెట్టి అరకొరగా రుణాలను మాఫీ చేసి గొప్పలు చెప్పకొంటున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామని పూర్తి చేసి మాట నిలబెట్టుకున్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అడ్డగోలు షరతులు పెట్టి అన్నదాతలను అగాథంలోకి నెట్టివేస్తున్నది. మొదటి, రెండో, మూడో విడుతల్లో కొంత మందికే రుణాలను మాఫీ చేయడంతో మిగిలిన రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రూ.2లక్షలకుపైగా అప్పు ఉన్నవారు తిరిగి చెల్లించాలని ఆంక్షలు విధించగా రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ అప్పులపాలవుతున్నారు.

# మాఫీ 30 శాతమే..

## వికారాబాద్ మండలంలో 70 శాతం మందికి అందని రుణమాఫీ

- రుణమాఫీకి సవాలక్ష నిబంధనలు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- కేసీఆర్ హయాంలో షరతుల్లేకుండా రుణమాఫీ
- అరకొరగా మాఫీ చేసిన ప్రస్తుత ప్రభుత్వం
- పంద్రాగస్టు వరకల్లా రూ.2లక్షలు మాఫీ చేస్తామని గొప్పలు
- సగానికిపైగా మాఫీ కాలేదంటూ బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు



వికారాబాద్, ఆగస్టు 26 : వికారాబాద్ మండలవ్యాప్తంగా ఉన్న రైతుల్లో 30 శాతం మందికి మాఫీ కాగా, ఇంకా 70 శాతం మంది రైతులకు రుణాలు మాఫీ కావాల్సి ఉన్నది. వికారాబాద్ కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ధారూరు సొసైటీ బ్యాంకు తదితర బ్యాంకుల్లో అన్నదాతలు పంట రుణాలు తీసుకున్నారు. రుణాలు తీసుకోండి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి హామీ మేరకు ఎంతో మంది గత సంవత్సరం కూడా పంట రుణాలు తీసుకున్నారు. అధిక శాతం పాతవారికి ఇటు కొత్తవారికి రుణాలు మాఫీ కాక ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ అంటూ అనేక కొర్రీలు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని మండిపడుతున్నారు. ఏ పల్లెకు వెళ్లి పలుకరించినా రుణమాఫీ కాలేదన్న సమాధానాలే రైతుల నుంచి వినిపిస్తున్నాయి. మండలంలోని గోధుమగూడ గ్రామంలో దాదాపు 250 మంది రైతులు ఉండగా, అందులో 80 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. దీంతో రుణమాఫీ కాని రైతులు అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇటు ప్రభుత్వ నిబంధనలు, అటు సాంకేతిక సమస్యలతో అధికారులు సైతం రైతులకు ఏం చెప్పాలో అర్థం కాక అయోమయానికి గురవుతున్నారు. అన్నదాతల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్‌కు రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా షరతుల్లేకుండా రుణాలను మాఫీ చేయాలని వికారాబాద్ మండల రైతులు వేడుకుంటున్నారు.

### మొదటి విడుతలోనే మాఫీ అవుతదనుకున్నా..



వికారాబాద్ యూనియన్ బ్యాంకులో ఏడాది కింద రూ.70 వేల రుణం తీసుకున్నా. కాంగ్రెస్ పార్టీ రుణాలను మాఫీ చేస్తామని గొప్పలు చెబితే ఎంతో సంతోషపడ్డా. మొదటి విడుతలోనే నా అప్పు పోతదనుకున్నా. రెండో, మూడో విడుతలోనూ మాఫీ కాలె. ఇగ రోజూ బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగడమే సరిపోతున్నది. రైతులను నమ్మించి మోసం చేయడం కాంగ్రెస్‌కు తగదు. ఇప్పటికైనా రైతుల బాధలను అర్థం చేసుకుని రైతులందరికీ రుణాలు మాఫీ చేసి మాట నిలబెట్టుకోవాలి.

– కృష్ణవేణి, గోధుమగూడ, వికారాబాద్

### మళ్లీ అప్పులపాలవుతున్నాం..



వికారాబాద్‌లోని కెనరా బ్యాంకులో రూ.1.10 లక్షలు పంట రుణం తీసుకున్నా. మూడో విడుతలో మాఫీ అవుతదనుకున్నా. జాబితాలో పేరు రాకపోవడంతో బ్యాంకు దగ్గరకు పోయినా. అధికారులను అడిగితే ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోమన్నారు. తర్వాత వ్యవసాయ ఆఫీస్‌కు పోయి అధికారులను అడిగితే దరఖాస్తు రాసివ్వాలన్నారు. రోజూ తిరుగుతనే ఉన్నా.. అయినా మాఫీ జాడే లేదు. 2018లో అప్పు తీసుకుంటే బ్యాంకు వారేమో ఏటా మిత్తి డబ్బులు తీసుకుని రెన్యూవల్ చేశారు. అన్ని కరెక్టుగా ఉన్నప్పుడు మాఫీ ఎందుకు కాలేదని అధికారులను అడిగితే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేయడం సరికాదు.

– ఈడిగి గోపాల్‌గౌడ్, గోధుమగూడ, వికారాబాద్



కడ్తాల్ మండల కేంద్రంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



సీజనల్ వ్యాధులు జిల్లాను కుదిపేస్తున్నాయి. గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. పట్టణాల్లో ఈ సంఖ్య మరింత అధికంగా ఉన్నది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు జ్వర పీడితులతో నిండిపోతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం, తప్పిదాలతో ప్రస్తుతం జిల్లా మొత్తం జ్వరంతో ఇబ్బందిపడుతున్నది. వర్షాకాలం ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రభుత్వం గాలికి వదిలేసింది. ముందస్తుగా బ్లీచింగ్ పౌడర్ సరఫరా, ఫాగింగ్ వంటివి నిర్వహించలేదు. డ్రైనేజీల్లో పూడిక తీయడం, గ్రామాల్లో నీరు నిల్వ గుంతలు పూడ్చడం చేయలేదు. దీంతో డెంగీతోపాటు మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి.

- రంగారెడ్డి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ)

- రంగారెడ్డి జిల్లాలో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- పల్లెలు, పట్టణాల్లో పెరుగుతున్న జ్వర పీడితులు
- ఇప్పటివరకు 188 డెంగీ కేసుల నమోదు
- నెల రోజుల జ్వర సర్వేలో 5,380కి పైగా రోగుల గుర్తింపు
- వాస్తవానికి ఇంతకు రెట్టింపుగానే బాధితులు
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం
- ఓపీ ఎక్కువగా ఉన్న దవాఖానల్లో బెడ్లు, మందుల కొరత!

# బాబోయ్..జ్వరాలు

### పంజా విసురుతున్న వ్యాధులు..

అసలే వానల కాలం. దీంతో ఒక్కసారిగా వ్యాధులు పంజా విసురుతున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ ఫీవర్లు తీవ్రమయ్యాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా డెంగీ, వైరల్ ఫీవర్లు, వాంతులు, విరేచనాలు, మలేరియా వ్యాధులతో జనం ఆసుపత్రుల బాట పడుతున్నారు. ఒంటి నొప్పులు, తలనొప్పులతో మొదలై జ్వరాలకు దారితీస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ చూసినా డెంగీ బాధితులే ఎక్కువగా కనిపి స్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 188 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కానీ.. రికార్డుల్లోకి రాని కేసులు ఇంతకు రెట్టింపేనన్నది నగ్నసత్యం. జ్వరాల తీవ్రత నేపథ్యంలో వైద్య సిబ్బంది కొద్ది రోజులుగా ఇంటింటికీ తిరి గి జ్వర సర్వే నిర్వహించి వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తున్నారు. నెల రోజుల్లోనే 5,380 మంది జ్వర పీడితులను గుర్తించినట్లు వైద్యసిబ్బంది పేర్కొంటున్నారు. కొన్ని పల్లె, బస్తీ దవాఖానల్లో ఇప్పటికీ డాక్టర్లే లేరు. ఖాళీలు భర్తీకి నోచుకోక కింది స్థాయి సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. దీనివల్ల ప్రజానీకానికి వైద్య సాయం అంతంత మాత్రంగానే అందుతున్నది. జ్వర పీడితుల తాకిడి ఎక్కువగా ఉండి ఓపీ అధికంగా ఉన్న దవాఖానల్లో బెడ్లు, మందుల కొరత తీవ్రంగా వేధిస్తున్నట్లు సమాచారం.



చేవెళ్ల దవాఖానలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు




నందిగామ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

### ముందస్తు చర్యలు శూన్యం..

ప్రతి సీజన్‌లోనూ వ్యాధులు ప్రబలడం సర్వసాధారణం. అయితే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల తీవ్రతను అరికట్టొచ్చు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం ఆ దిశగా ముందస్తు జాగ్రత్తలేవీ చేపట్టలేదు. ఇన్‌చార్జీల పాలనలో పంచాయతీల్లో పాలన పడకేయడంతోపాటు నిధుల కొరత వేధిస్తుండడంతో పారిశుధ్య చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తూ వ్యాధులను విస్తరింపజేస్తున్నాయి. కొన్ని రోజులుగా జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తున్న వ్యా ధులతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. వ్యాధులు ప్రబలినప్పుడే హడావుడి చేసే వైద్యశాఖ.. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైంది. అటు పంచాయతీ, మున్సిపల్ శాఖలు..ఇటు వైద్యశాఖలు మొదటినుంచీ నిర్లిప్తత వహించిన కారణంగా అధికార యంత్రాంగానికి వ్యాధులు సవాల్ విసురుతున్నాయి.

### పేషెంట్లు సరే.. డాక్టర్లు ఏరీ ?

**కొత్తూరు దవాఖానలో ఏఎన్ఎంతోనే వైద్యం**

కొత్తూరు, ఆగస్టు 26 : కొత్తూరు మండల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని తిమ్మాపూర్‌లో ఇప్పటికే డెంగీతో ఓ వ్యక్తి మృతి చెందాడు. అలర్ట్‌గా ఉండాల్సిన డాక్టర్లు ఏఎన్ఎంలతో వైద్యం చేయిస్తున్నారు. దవాఖానలో మండల వైద్యాధికారితో పాటు 5 మంది డాక్టర్లు ఉన్నారు. సోమవారం దవాఖానకు 40 మంది రోగులు వచ్చినా ఏఎన్ఎంతోనే రోగులు వైద్యం చేయించుకున్నారు. ఆరుగురిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీసం ఒకరిద్దరు డాక్టర్లు ఉన్నా మెరుగైన వైద్యం అందేదని రోగులు అభిప్రాయపడ్డారు.



శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గంలో సోమవారం అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య మూడు నివాసాలు, ఐదు నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇండ్లల్లో ఉన్న సామగ్రి అంతటినీ ఇలా బయటపడేయడంతో ఆ కుటుంబాలన్నీ కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. నేలమట్టమైన తమ ఇండ్లను చూసుకుంటూ.. దీనంగా అక్కడే కూర్చుండిపోయారు. అనుమతులు.. కోర్టు స్టే ఉన్నా.. కూల్చారంటూ.. ఆవేదన చెందారు.

# విల్లాలపై వివరణ ఇవ్వండి

- నిబంధనలు అతిక్రమించారని విల్లాలకు హెచ్ఎండీఏ నోటీసులు
- చిత్రపురి కాలనీలో 50కిపైగా విల్లాలు ఉన్నట్లు వెల్లడి
- హకీంపేట్ లే అవుట్‌లో మౌలిక వసతులు

సిటీబ్యూరో, ఆగస్ట్ 26 (నమస్తే తెలంగాణ) : నగరంలో అక్రమ నిర్మాణాలపై జరుగుతున్న కూల్చివేతల నేపథ్యంలో హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం అధికారులు కీలక చర్యలు చేపట్టారు. తమ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించడంతోపాటు, నిబంధనలు అతిక్రమించిన ఇంటి యజమానులకు సైతం నోటీసులు జారీ చేస్తున్నారు. తాజాగా, చిత్రపురి కాలనీలో నిర్మించిన సుమారు 50కిపైగా విల్లాలకు స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ నోటీసులను అందించినట్లు తేలింది. అయితే నోటీసుల ప్రకారం గ్రౌండ్+1 విల్లాలకు అనుమతులు తీసుకుని, నిర్మాణాలను అందకు భిన్నంగా, అక్రమంగా మరో అంతస్తు విల్లాలను బిల్డర్లు నిర్మించినట్లు వెల్లడైంది. నిర్మాణంలో జరిగిన అవకతవకలను పట్టించుకోకపోవడంతోనే ఈ తరహా నిబంధనల అతిక్రమణ జరిగినట్లు తేలింది.

#### చర్యలు తీసుకుంటారా?

గచ్చిబౌలి, రాయదుర్గం వంటి ప్రధాన కేంద్రానికి సమీపంలో ఉండే సంపన్నుల విషయంలో హెచ్ఎండీఏ అధికారులు నోటీసులు అయితే జారీ చేశారు. కానీ తదుపరి ఏ విధమైన చర్యలు తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. 15 రోజుల గడువులోగా నోటీసులకు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులతో ఆయా భవన యజమానులకు సూచించినట్లు తేలింది. అయితే ఈ తరహా నిర్మాణాలు ఎన్ని ఉన్నాయనే అంశాన్ని కూడా తేల్చే క్రమంలో ఈ తరహా నోటీసుల ప్రక్రియకు తెరలేపినట్లుగా హెచ్ఎండీఏ వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

హెచ్ఎండీఏ పరిధిలో భూముల వేలానికి అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. వందల ఎకరాల్లో రెసిడెన్షియల్, కమర్షియల్ లే అవుట్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో పెండింగ్‌లో ఉన్న లే అవుట్లపై దృష్టి పెట్టిన అధికారులు.. అందుకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. వచ్చే ఏడాదిలోగా లే అవుట్లను అభివృద్ధి చేయనున్నారు. షేక్‌పేట్ మండలం హకీంపేట్ పరిధిలోని హుడా హైట్స్ లే అవుట్‌లో రోడ్లు, హద్దురాళ్లు, అంతర్గత రోడ్లతోపాటు, డ్రైనేజీ కోసం రూ. 1.2 కోట్లతో పనులు చేపట్టనున్నారు. హుడా హైట్స్ పేరిట 50 ఎకరాల విస్తీర్ణంలో 92 ప్లాట్లను డెవలప్ చేయగా, తాజాగా మూడు నెలల్లోగా నిర్మాణ పనులు పూర్తి చేసేలా పనులు చేపట్టనున్నారు. అందుకు అనుగుణంగా టెండర్ ప్రక్రియను హెచ్ఎండీఏ ఇంజినీరింగ్ అధికారులు చేపట్టారు. వీటితోపాటు హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన అన్ని లే అవుట్లలో కూడా ఇదే తరహాలో మౌలిక వసతుల కల్పనకు పనులు చేపట్టనున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.



బొంరాస్‌పేటలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

# కనుల పండువగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



తాండూరులో..

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. వైష్ణవ ఆలయాల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి రకరకాల తీపి వంటకాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏ పల్లెలో చూసినా చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు చూపరులను అలరింపజేశారు. కోలాటం, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పల్లెలు, పట్టణాల్లో సందడి నెలకొన్నది. అనంతర ఉట్లు కొట్టే కార్యక్రమాలు ఆసక్తికరంగా కొనసాగాయి. విజేతలకు పలువురు ప్రముఖులు బహుమతులను అందజేశారు.



షాద్‌నగర్ పట్టణంలో..